క్లుప్తంగా

ఆలయాలకు భక్తుల తాకిడి



సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయం

తగరపువలస: సంక్రాంతి పండగతో పాటు అన్నివర్గాల ప్రజలకు వరుస సెలవులు రావడంతో ఆలయాలకు భక్తులు పోటెత్తుతున్నారు. ముఖ్యంగా జాతీయరహదారి వెంట ఉన్న సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయం, వేంకటేశ్వరమెట్టపై ఉన్న శ్రీదేవి, భూదేవి సహిత శ్రీవారి ఆలయానికి భక్తులు తండోపతండాలుగా తరలి వస్తున్నారు. ఆయా ఆలయాల్లో మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆలయాలను సుందరంగా అలంకరించారు. పండగతో పాటు సోమవారం పౌర్ణమి కారణంగా దేవదాయశాఖ ఆధ్వర్యంలో సంగివలస కొత్తమ్మతల్లి ఆలయంలో ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో దుర్గా హోమం నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

క్రికెట్ విజేత ఢిల్లీ డేర్ డెవిల్స్



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న గ్రామ పెద్దలు

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద పంచాయతీ మద్దిలపేటలో కనకల వెంకటేష్ జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతగా ఢిల్లీ డేర్ డెవిల్స్ జట్టు నిలిచింది. ఈ సందర్భంగా విజేత జట్టుకు జిల్లా క్వారీ లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు మద్దిల వెంకటరమణ, కనకల గోవింద్, కనకల అప్పలనారాయణ, మద్దిల ఆదినారాయణ, బోని రామకృష్ణ, మద్దిల వెంకట శివకుమార్, మద్దిల శివ, కాళ్ల సన్నిబాబు, మద్దిల గురునాథ్ తదితరులు సోమవారం ట్రోఫీ ప్రదానం చేశారు. మద్దిల సూరిబాబు కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించారు.

నిత్యావసర సరకుల పంపిణీ

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు సాగర్‌నగర్‌లో సోమవారం సంక్రాంతి పురస్కరించుకుని సాగర్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్(ఎస్‌జేడబ్ల్యూఏ) ఆధ్వర్యంలో పాత్రికేయులకు బియ్యం, పప్పు, నూనె తదితర నిత్యావసర సరకులు అందించారు. ఇక నుంచి ఏటా సంఘం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సభ్యులు తెలిపారు.

ముగిసిన విజ్ఞాన్ వార్షికోత్సవాలు



ఉమ్మడి కుటుంబానికి ఈశ్వరుని కుటుంబాన్ని ఉదహరిస్తూ విద్యార్థుల ప్రదర్శన

తగరపువలస: ఆనందపురం మండలం గుడిలోవ విజ్ఞాన్ విహార 45వ వార్షికోత్సవాలు సోమవారం నాటి సాంస్కృతిక కార్యక్రమాలతో ముగిశాయి. ఈ సందర్భంగా మణిపూర్ విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం ఉమ్మడి కుటుంబం నేపథ్యంలో లయకారుడైన పరమేశ్వరుడి కుటుంబాన్ని ఉదాహరణగా చూపిస్తూ అనుబంధాలు, ఆప్యాయతలు మాత్రమే ఉమ్మడి కుటుంబాలకు మూలసూత్రమని ప్రదర్శన ద్వారా చాటిచెప్పారు. పర్యావరణ ఆవశ్యకతను వివరిస్తూ కాలుష్య నివారణకు వృక్షో రక్షతి రక్షితః నాటిక ద్వారా సందేశమిచ్చారు.

పేకాట ఆడుతున్న ముగ్గురి అరెస్ట్

పద్మనాభం: మండలంలోని కోరాడ సచివాలయం వెనుకనున్న ఖాళీ ప్రదేశంలో సోమవారం పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు పద్మనాభం పోలీసులు తెలిపారు. వీరి నుంచి రూ.5,650 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చూసి తీర్థాల్సిందే!

- పండగ వేళ తీర్థాలు, పరసల సందడి
- రేపు అచ్చియ్యమ్మ పేరంటాల తీర్థం
- 16న కోదండ రాముడి పరస



కోరిన కోర్కెలు తీర్చే అచ్చియ్యమ్మ పేరంటాలు

సంక్రాంతి వస్తుందంటే చాలు చుట్టాలు, బంధువులు, కొత్త అల్లుళ్లతో ఊరూవాడా సందడి గురించి ఎంత చెప్పినా తక్కువే. ఎక్కడ చూసినా పండగ శోభ ఉట్టిపడుతుంది. వీటికి తోడు ఇదే సమయంలో తీర్థాలు, పరసలు పండగ ఆనందాన్ని రెట్టింపు చేస్తాయి. మధురవాడ ప్రాంతంలోని 14 గ్రామాల్లో మధురవాడ జోనల్ ఆఫీసు వద్ద ఉన్న అచ్చియ్యమ్మ పేరంటాలు తీర్థం, అప్ బ్రిడ్జి దరి శ్రీ మహా గణపతి సాయినాథ సహిత శ్రీ కోదండ రాముడి పరస ప్రసిద్ధి.

దీంతో అనాదిగా సంక్రాంతి సమయంలో ఇక్కడ తీర్థాలు, పరస నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా పండగను రెండింతల ఆనందమయం చేసేందుకు ఏర్పాట్లు జరిగాయి.



పరస కోసం ముస్తాబైన కోదండ రాముడు, సీతా, లక్ష్మణ స్వాములు

మధురవాడ: స్థానిక అచ్చియ్యమ్మ పేరంటాలు, కోదండ రాముడిపై భక్తులకు చెప్పలేనంత నమ్మకం. కోరి కొలిస్తే కోరిన కోర్కెలు తీరుస్తారని విశ్వాసం.

అచ్చియ్యమ్మ పేరంటాలు తీర్థం రేపు

మధురవాడలో ఈ తీర్థం సుమారు 129 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. క్రమం తప్పకుండా ప్రతి ఏటా కనుమ రోజున అత్యంత వైభవంగా అల్లాడ వారి కుటుంబీకులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఇక్కడ బైటో భజన, చెక్క భజన, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక-ఆరాధనా కార్యక్రమాలను ధర్మకర్తలు అల్లాడ ఉమామహేశ్వరరావు, అల్లాడ వెంకటరావు, అల్లాడ సూర్యారావు, అల్లాడ గంగరాజు, అల్లాడ లింగేశ్వరరావు తదితరుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తారు.

16న కోదండ రాముడి పరస

కనుమ మరుసటి రోజున బక్కన్నపాలెం రోడ్డులో ఉన్న శ్రీ మహా గణపతి సాయినాథ సహిత శ్రీ కోదండ రాముడి ఆలయంలో కొలువైన కోదండ రాముడి పరసను ఏటా నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఆలయం వద్దిరాజు క్రిష్ణవేణి సారథ్యంలో నిర్వహిస్తున్నారు. ఆమె విదేశాల్లో ఉంటున్నా.. ఆలయ నిర్వహణకు అవసరమైన ప్రతి సాయం చేస్తుంటారు. ఈ నెల 16న ఇక్కడ పరస నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సాధారణంగా ప్రతి రోజూ ఉదయం 6.30 నిమిషాలు నుంచి మధ్యాహ్నం 11గంటలు వరకు, సాయంత్రం 6గంటలు నుంచి సాయంత్రం 8గంటలు వరకు పూజలు జరుగుతాయి. పరస సందర్భంగా ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయం తెరచి ఉండడమే కాకుండా వివిధ రకాల పూజలు నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఇందుకోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆత్మార్పణం చేసుకున్న అచ్చియ్యమ్మ

అచ్చియ్యమ్మ పేరంటాలు.. ఎండాడ శేఖరి వారి ఆడపడుచు, మల్లయ్యపాలెం అల్లాడ వారి కోడలు. మధురవాడ పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్య దేవతగా ప్రసిద్ధి చెందారు. సుమారు 130 ఏళ్ల క్రితం జరిగిన యదార్థ గాథ ఇప్పటికీ కథలు కథలుగా ఇక్కడి వారు చెప్పుకుంటారు. అమ్మ భర్త శంకు అప్పుడు బ్రిటీష్ కాలంలో మధురవాడ ఏరియాలో మానూల్ బంట్రోతుగా పనిచేసేవారు. ఆయన ఉద్యోగం చేస్తుండగా అనారోగ్యంతో మృతి చెందారు. భర్తలేని జీవితం వ్యర్థం అని భావించిన ఆ తల్లి కొద్ది రోజులకే భర్తకు అంత్యక్రియలు జరిగిన చోటే జరుగుతున్న యాగం మంటల్లో పడి ఆత్మార్పణ చేశారు. అప్పట్లో ఈ ఘటన సంచలనంగా మారింది. తర్వాత కొన్నాళ్లకు అమ్మ వారి మహిమలు ఆనోటా.. ఈనోటా వ్యాపించాయి. వారి సమాధే గుడిగా మారింది. ఏటా ప్రత్యేక పూజలు, ఉత్సవాలు సంప్రదాయంగా మారాయి.



మధురవాడ జోనల్ ఆఫీసు వద్దనున్న అచ్చియ్యమ్మ పేరంటాలు గుడి

ఆరాధ్య దేవత అచ్చియ్యమ్మ



పేరంటాలు తల్లి యండాడ శేఖర్ వారి పిల్ల అయినా మా కుటుంబానికీ ఆ తల్లే ఇలవేల్పు. మాకే కాదు.. మధురవాడ, సాగర్‌నగర్ పరిసర 14 గ్రామాల ఆరాధ్య దేవత. అమ్మను తలచుకుని ఏ పని మొదలు పెట్టినా తిరుగే ఉండదు. ఏటా మా శక్తి కొలది ఉత్సవాలు నిర్వహిస్తాం. భక్తుల సహకారం కూడా ఎక్కువే.
– అల్లాడ వెంకటరావు, ధర్మకర్తల మండలి సభ్యుడు, అచ్చియ్యమ్మ పేరంటాలు గుడి

అది స్వామి మహిమ



మేమంతా నిమిత్త మాత్రులం. గుడి వద్ద, మధురవాడలో కోదండ రాముడు పేరు మీద ఏ కార్యక్రమం జరిగినా అది స్వామివారి ఆశీస్సుల బలమే. ప్రతి ఏటా ఎక్కడున్నా పర సమయానికి ఇక్కడి వస్తాం. పరసలో పాల్గొంటాం. పరస సందర్భంగా ప్రత్యేక పూజలు, కార్యక్రమాలకు ముమ్మర ఏర్పాట్లు చేశాం.
– వద్దిరాజు కృష్ణవేణి, ధర్మకర్త, కోదండ రాముడి ఆలయం

సంక్రాంతి వచ్చింది.. సంబరాలు తెచ్చింది



రామన్నపేటలో పొంగలి తయారు చేస్తున్న మహిళలు

తగరపువలస: భోగి పండగతో సంక్రాంతి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. భీమిలి అర్బన్, రూరల్ పరిధిలో పలుచోట్ల చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా మంగళస్నానాలు ఆచరించి భోగిమంటలు వేశారు. మంటల నుంచి వచ్చిన విభూతిని భద్రపరచుకున్నారు. రామన్నపేటలోని సాయిరవీంద్ర పాఠశాల వద్ద మహిళలు నిర్వహించిన సంక్రాంతి వేడుకల్లో ఆరుబయట కట్టెల పొయ్యిపై పొంగలి తయారుచేశారు. చెరకుగడతో కలియబెట్టి సూర్యునికి ప్రసాదంగా నివేదించి, గ్రామంలో పంచిపెట్టారు. చిట్టివలస, సంతపేట, టి.నగరపాలెం తదితర గ్రామాల్లో వేకువజామునే అక్కడి ఆలయ కమిటీ ప్రతినిధులు మేలుకొలుపు నిర్వహించారు.

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు ప్రాంతాలైన గుడ్లవానిపాలెం, సాగర్‌నగర్, ఎండాడ ప్రాంతాల్లో భోగి సందర్భంగా వాడవాడలా ఉత్సవాలు నిర్వహించారు. ఆ ప్రాంత వాసులు వేకువ జామునే భోగి మంటులు వేసి సందడి చేసి, అందరిని మేల్కొలిపారు. ఎండాడ రామాలయం వద్ద మహిళలు ముగ్గులు పోటీలు నిర్వహించారు. సాగర్‌నగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. విజేతలకు స్థానిక నాయకులు బోడపూడి దొరబాబు బహుమతులు అందజేశారు.

మధురవాడ: సంక్రాంతి శోభ ఉట్టిపడేలా నగరంలోని మధురవాడ, చంద్రంపాలెం గ్రామస్తులు సంక్రాంతి సంబరాలను సోమవారం సాయంత్రం అత్యంత వైభవంగా నిర్వహించారు. అంతా ఒకే వేదికపైకి వచ్చి చంద్రంపాలెం పిలుస్తోంది సంక్రాంతికి.. అనే నినాదంతో వేడుకలు జరిపారు. భోగి మంటలు వేసి, డూడూ బసవన్నలు, హరిదాసులు సందడి చేశారు. మహిళల కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి. మహిళలకు ముగ్గులు, చిన్నారులకు ఫ్యాన్సీ డ్రెస్, డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. బొమ్మల కొలువు ఆహూతుల్ని ఆకట్టుకుంది.

శిల్పారామం జాతరలో..

పీఎంపాలెం: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మధురవాడ శిల్పారామం జాతరలో సోమవారం భోగి పండగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అదరహో అనిపించాయి. జానపద, శాస్త్రీయ, మోడరన్ నృత్యాలతో కళాకారులు ఆహూతుల్ని కట్టిపడేశారు. ఆద్యంతం ప్రేక్షకుల కరతాళ ధ్వనులు మిన్నంటాయి. విశాఖపట్నం సరస్వతి నృత్య కళా మందిరానికి చెందిన కళాకారులు బాలసరస్వతి నృత్య దర్శకత్వంలో ఈ ప్రదర్శనలు ఇచ్చారు. శిల్పారామ పరిపాలనాధికారి టి.విశ్వనాథరెడ్డి పర్యవేక్షించారు.

పద్మనాభం: మండల ప్రజలు సోమవారం ఆనందోత్సాహాల నడుమ భోగి పండగ చేసుకున్నారు. కృష్ణాపురంలో ఈ సంబరాలు అట్టహాసంగా జరిపారు. సామాజిక వేదికను సంక్రాంతి శోభ ఉట్టిపడేలా తీర్చిదిద్దారు. దీని ముందు భోగి మంట వేశారు.

భీమునిపట్నం: భీమిలి బీచ్ సమీపంలోని పైలాన్ వద్ద భీమిలి ప్రెస్‌క్లబ్, ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి(ఫ్యాబ్) ఆధ్వర్యంలో సోమవారం సామూహిక భోగి సంబరాలు వైభవంగా జరిగాయి. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి, భోగి మంటను వెలిగించారు. గంగిరెద్దు ప్రదర్శన, పిట్టలదొర కబుర్లు, హరిదాసు కీర్తనలు, వేషధారణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. 3వ వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, పెద్దలు మైలిపల్లి షణ్ముఖరావు, గంటా నూకరాజు, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి అడిదం కిశోర్, సభ్యులు ఎం.సూర్యశ్రీనివాస్, పీబీఎంకే వర్మ, ఎ.అంజనీకుమార్, ఫ్యాబ్ అధ్యక్షుడు కాళ్ల సన్నీ, సభ్యులు నరేంద్రకుమార్, దేవానంద్, గోపి, సాయి పాల్గొన్నారు.



చిట్టివలసలో మేలుకొలుపు నిర్వహిస్తున్న స్థానికులు



ముగ్గుల పోటీ విజేతలకు బహుమతుల అందజేత



కృష్ణాపురంలో వేసిన భోగి మంట వద్ద గ్రామస్తులు



చంద్రంపాలెంలో ఆకట్టుకున్న చిన్నారుల ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు



చంద్రంపాలెంలో సంక్రాంతి సంబరాల్లో భోగి మంట



శిల్పారామం జాతరలో ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



ఆకట్టుకున్న వేషధారణలు, డూడూ బసవన్నలు

మార్కెట్‌కు సంక్రాంతి శోభ



ప్రైవేట్ మార్కెట్‌లో రద్దీగా పండ్లు, చెరకు విక్రయించే ప్రదేశం

తగరపువలస: సంక్రాంతి వేళ స్థానిక మార్కెట్ సోమవారం కళకళలాడింది. ఇక్కడి మార్కెట్ భీమిలి నియోజకవర్గంలోని మూడు మండలాలు, నెల్లిమర్ల నియోజకవర్గంలోని రెండు మండలాలకు కేంద్ర బిందువు కావడంతో చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున కూరగాయల వ్యాపారులు, వినియోగదారులతో కిటకిటలాడింది. ప్రధానంగా స్థానిక ప్రైవేట్ మార్కెట్‌లో సంక్రాంతి పూజలకు పనికివచ్చే వస్త్రాలు, కొత్త కుండలు, వెదురు వస్తువులు, పువ్వులు, పండ్లు, మసాలా దినుసులు తదితరాలు విక్రయిస్తుంటారు. దీనికి తోడు ప్రతి ఆదివారం, భోగి పండగ రోజు ఇక్కడ సంత నిర్వహించడం ఆనవాయితీ. దీంతో బంగ్లామెట్ట నుంచి తాతా థియేటర్ వరకు ప్రధాన రహదారి కిక్కిరిసింది. సాధారణ రోజుల్లో రూ.20–30 విక్రయించే కొబ్బరికాయలకు రెట్టింపు ధర పలికింది.

తాగునీరు వృథా



వృథాగా పోతున్న నీరు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సుభాష్‌నగర్ ప్రాంతంలో జీవీఎంసీ మంచినీటి పైప్‌లైన్ పగిలి తాగునీరు వృథాగా పోతోంది. వారం రోజుల నుంచి నీరు వృథాగా పోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదంటూ స్థానికులు చెప్తున్నారు. ఈ లీకేజీతో పూర్తి స్థాయిలో తమకు తాగునీరు అందడంలేదని ఆక్షేపిస్తున్నారు. తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

కమనీయం.. గోదారంగనాథుల కల్యాణం



కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదా రంగనాథుల కల్యాణం



గుడిలోవ రంగనాథస్వామి ఆలయంలో కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

తగరపువలస: భోగి పండగ, ధనుర్మాస చివరి రోజు సందర్భంగా జీవీఎంసీ భీమిలి జోన్ వేంకటేశ్వరమెట్ట పైనున్న శ్రీవారి ఆలయంలో, ఆనందపురం మండలం పాలవలస పంచాయతీ గుడిలోవ రంగనాథస్వామి ఆలయంలో సోమవారం గోదా రంగనాథుల కల్యాణం కన్నులపండువగా జరిగింది. వేంకటేశ్వరమెట్టపై ఆలయ ట్రస్టీ రాజగిరి కుసుమహర ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పురోహితులు రామాచార్యులు, ప్రసాద్‌శర్మ భక్తులకు గోదాదేవి చరిత్రను వివరించారు. వివాహ ఆటంకాలు ఎదుర్కొంటున్న వారు గోదాదేవి కల్యాణం చూస్తే కల్యాణప్రాప్తి కలుగుతుందన్నారు. భార్యాభర్తల మధ్య అపార్థాలు తొలిగి, అన్యోన్య దాంపత్యం సిద్ధిస్తుందన్నారు. గుడిలోవ రంగనాథస్వామి ఆలయంలో ఈవో నానాజీబాబు ఆధ్వర్యంలో జరిగిన కల్యాణ వేడుకలను కామేశ్వరశర్మ, సంతోష్ఘలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ కోరాడ గిరిరాజు, ట్రస్టీ దన్యాల సూర్యనారాయణ, ఆలయ సిబ్బంది ఈశ్వర్‌తో పాటు 400 మంది భక్తులు పాల్గొన్నారు.

పద్మనాభం: ధనుర్మాసోత్సవాల ముగింపులో భాగంగా పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో గోదా రంగనాయకుల కల్యాణం కనుల పండువగా జరిగింది. ముందుగా స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత రంగ నాయకులను ఓ పల్లకీలో, గోదాదేవిని మరో పల్లకీలో అధిష్ఠింపజేసి గోస్తనీ నదిలోకి తీసుకెళ్లి నీరాటోత్సవం నిర్వహించారు. ఆ తర్వాత ఆలయానికి చేర్చి కల్యాణ వేడుకను ఘనంగా జరిపారు. అర్చక స్వాములు పి.సీతారామాంజనేయ స్వామి, పవన్ కల్యాణాన్ని శాస్త్రోకంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, సర్పంచ్ తాలాడ పాప, కోరుకొండ సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.శాస్త్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు తాలాడ పద్మనాభం పాల్గొన్నారు.

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్ శ్రీ అష్టలక్ష్మీ దేవాలయంలో గోదా రంగనాథుల కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం ఆలయ ప్రధాన ద్వారం వద్ద భోగి మంటలు వేశారు. ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి ఆధ్వర్యంలో సాయంత్రం కల్యాణ వేడుకను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు, మహిళలు పాల్గొన్నారు.

- భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట శ్రీ త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి వారి వారిజ ఆశ్రమంలో సోమవారం గోదాదేవి, రంగనాథస్వామిల కల్యాణం కనుల పండువగా సాగింది. వివిధ వర్ణాల పూలతో వేసిన పందిరిలో గోదా, రంగనాథుల ఉత్సవ మూర్తులను కొలువుంచి, వేద పండితుల ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.



కుంతీ మాధవ స్వామి ఆలయంలో గోదాదేవి, రంగనాయకుల విగ్రహాలకు నిర్వహిస్తున్న కల్యాణం



వారిజ ఆశ్రమంలో గోదా రంగనాథుల కల్యాణం

భీమునిపట్నం: స్థానిక కృష్ణాకాలనీ కొండపైనున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు అప్పలాచార్యులు ఆధ్వర్యంలో, కీతిన్‌పేట సమీపంలోని ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో గోదా రంగనాయకుల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆయా కార్యక్రమాల్లో కల్యాణవేంకటేశ్వర ఆలయ కమిటీ సభ్యులు కె.ముత్యాలరావు, గొరపల్లి సన్యాసినావు, మొకర శంకర్, ఐశ్వర్య వేంకటేశ్వర ఆలయ ట్రస్టీలు కలిగొట్ల శ్రీరామ్, కలిగొట్ల సూర్యనారాయణమూర్తి, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.